క్లుప్తంగా

వచ్చే నెల 23న ప్రజాభిప్రాయ సేకరణ


నోటీసు బోర్డులో ముసాయిదాను ప్రదర్శిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: తీర ప్రాంత నియంత్రణ జోన్ ముసాయిదా డ్రాఫ్ట్‌ను తన కార్యాలయ నోటిఫికేషన్ బోర్డులో ఆర్డీవో హెచ్.వి.జయరాం శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీర ప్రాంత నియంత్రణ జోన్ 2019 ముసాయిదాపై వచ్చే నెల 23న కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుందన్నారు. జిల్లాలో తీర ప్రాంతాలైన పాయకరావుపేట, ఎస్.రాయవరం, అచ్యుతాపురం, పరవాడ మత్స్యకారులు, ఇతరులు హాజరై అభిప్రాయాలను తెలియజేయవచ్చన్నారు. వారి సూచనలకు అనుగుణంగా తీర ప్రాంతంలోని మత్స్యకారుల జీవనోపాధి, పర్యావరణ పరిరక్షణ వంటి చర్యలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీలు

- ఎస్ఆర్పీ రాజేంద్ర


మాట్లాడుతున్న ఏపీవో అప్పలరాజు

కె.కోటపాడు: 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో చేసిన ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు పారదర్శకంగా చేస్తున్నట్లు ఎస్ఆర్పీ డి.రాజేంద్ర తెలిపారు. మండలంలో 32 గ్రామ పంచాయతీల్లో రూ.27.69 కోట్లతో చేసిన ఉపాధి పనుల పరిశీలనకు సంబంధించి శుక్రవారం వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులతో సమన్వయ కమిటీ సమావేశం స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్ర మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఉపాధి పనుల పరిశీలన, అనంతరం గ్రామసభ నిర్వహించాలన్నారు. అన్ని గ్రామాల్లో సోషల్ ఆడిట్ పూర్తయిన తర్వాత మండల స్థాయి ప్రజా వేదికలో నివేదికలను డీఆర్పీలు బహిర్గతం చేస్తారన్నారు. ఎంపీడీవో అప్పలరాజు, ఈవోపీఆర్డీ ప్రసాద్, మండల ఇంజినీర్ బాలాజీ అప్పారావు, ఏపీవో అప్పలరాజు, పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు పాల్గొన్నారు.

విత్తన నాణ్యత లోపిస్తే శాఖాపరమైన చర్యలు

ఫెర్టిలైజర్స్ విత్తన దుకాణాన్ని తనిఖీ చేసిన ఏవో

మాడుగుల: విత్తనాల్లో నాణ్యత లోపిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఏవో ఎం.వాసుదేవరావు హెచ్చరించారు. ఘాట్‌రోడ్ జంక్షన్‌లో వరలక్ష్మి ఫెర్టిలైజర్స్ విత్తన దుకాణాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. దుకాణంలో విక్రయానికి సిద్ధం చేసిన ఆర్జీఎల్, 2537, సాంబమసూరి, స్వర్ణమసూరి, పుష్యమి, సంపద విత్తనాల నమూనాలు సేకరించి మొలక శాతం తెలుసుకోవడానికి విత్తన పరీక్ష ప్రయోగశాలకు పంపించామన్నారు. నాణ్యత లోపించినట్లు తేలితే సంబంధిత డీలరుపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేటు వ్యాపారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసినట్లయితే రైతులు వారి నుంచి విధిగా బిల్లు తీసుకోవాలన్నారు. మొలక శాతం బాగుంటేనే నారు పోయాలన్నారు. మొలక శాతం 80 శాతం కంటే తక్కువ ఉంటే, కొనుగోలు చేసిన విత్తన బస్తాను, ట్యాగ్‌తో సహా జాగ్రత్తగా ఉంచి తిరిగి ఇచ్చేయాలన్నారు. ఖరీఫ్ విత్తనాలలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కొవ్వూరులో కొండ చిలువ హతం


హతమైన 12 అడుగుల కొండ చిలువ

రోలుగుంట: కొవ్వూరులో ఓ ఇంటి వద్ద 12 అడుగుల కొండ చిలువను స్థానికులు హతమార్చారు. గ్రామానికి చెందిన యర్రంశెట్టి నర్సింగరావు కుటుంబీకులు శుక్రవారం మధ్యాహ్నం పొలం పనులకు వెళ్లారు. వీరు తమ ఇంటి వద్ద కోళ్లను పెంచుతున్నారు. సమీప పొలాల నుంచి వచ్చిన భారీ కొండ చిలువ స్తంభానికి చుట్టుకుని స్థానికులకు కనిపించింది. దీంతో యువకులు దాన్ని హతం చేశారు. దీన్ని గుర్తించకపోయి ఉంటే సమీపంలో ఆడుకుంటున్న పిల్లలు ప్రమాదానికి గురయ్యేవారని స్థానికులు చెప్తున్నారు.

యోగానందం

- వేడుకగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- ఆకట్టుకున్న యోగాసనాలు

సంపూర్ణ ఆరోగ్యానికి, ఆనందానికి, మానసిక ప్రశాంతతకు యోగా ఓ దివ్యౌషధం. భారతీయ ప్రాచీన కళగా ప్రాచుర్యం పొందిన యోగా పట్ల ఆబాలగోపాలం ఎనలేని మక్కువ ప్రదర్శించింది. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గ్రామ గ్రామాన యోగాభ్యసనాలు చేశారు. యోగా విశిష్టతను వివరించారు.


నర్సీపట్నం: కోర్టు సిబ్బందితో కలిసి ఆసనాలు ప్రదర్శిస్తున్న న్యాయమూర్తులు పఠాన్ షియాజ్ ఖాన్, మధుసూదనరావు


గొలుగొండ: యోగా చేస్తున్న పోలీసులు


దేవరాపల్లి: తెనుగుపూడి గురుకుల విద్యాలయంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

నర్సీపట్నం: స్థానిక కోర్టు సముదాయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మధుసూదన్‌రావు, కోర్టు సిబ్బంది, పలువురు న్యాయవాదులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. న్యాయమూర్తులు పలు ఆసనాలు వేసి యోగా విశిష్టత గురించి వివరించారు. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శక్తినిచ్చే సాధనంగా యోగా దోహదపడుతుందన్నారు.

యోగాతో ఆరోగ్యకర జీవనం..

బీసీ కాలనీలోని బాలసదనంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. సీడీపీవో మేరీ సువార్త వివిధ రకాల ఆసనాలు ప్రదర్శించారు. వాటిపై విద్యార్థినులకు తర్ఫీదు ఇచ్చారు.

యోగాతో ప్రశాంతత..

యోగా సాధనతో ప్రశాంతత ఏర్పడుతుందని ఎంఈవో చీడిపల్లి తలుపులు విద్యార్థులకు సూచించారు. పెదబొడ్డేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన యోగా దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. యోగ సాధన చేస్తే సత్ఫలితాలు వస్తాయని, ఏకాగ్రత, మానసిక ప్రశాంతత లభిస్తుందని విద్యార్థులకు సూచించారు. హెచ్ఎం కె.లక్ష్మీబాయ్, ఉపాధ్యాయులు అల్లు అప్పారావు, బాబి, పూడి అప్పారావు, పీడీ బుల్లిబ్బాయి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో...

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా దినోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ఆయుష్ విభాగం శ్రీనివాసరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. దైనందిన జీవితంలో యోగాను అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం పలు ఆసనాలు వేయించారు. ప్రిన్సిపాల్ డాక్టరు ఎస్.రాజు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ కొండలరావు, చక్రవర్తి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

చోడవరం: పతంజలి యోగా శిక్షణ కేంద్రం, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అన్ని కాలేజీలు, స్కూళ్లలో విద్యార్థులతోపాటు యోగా శిక్షకులు యోగాసనాలు వేశారు. యోగా వల్ల పొందే మంచి ఆరోగ్యం, శారీరక సౌష్టవం కోసం వివరిస్తూ పతంజలి యోగా శిక్షణ కేంద్రం గురువు పుల్లేటి సతీష్ వివిధ ఆసనాలు వేసి అందర్నీ అబ్బుర పరిచారు. పెద్ద, చిన్న తేడా లేకుండా అంతా యోగాసనాలు వేశారు. ఉషోదయ విద్యా సంస్థల చైర్మన్ జె.రమణాజీ, యోగా కేంద్రం ప్రతినిధులు పి. అశోక్, బోగవిల్లి గణేష్ పాల్గొన్నారు. చోడవరం వాకర్స్ క్లబ్ ఆవరణలో విద్యార్థులు, వాకర్స్ పాల్గొని యోగాసనాలు వేశారు. యోగా క్లబ్ ప్రతినిధి పప్పల రమణమూర్తి, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఓరుగంటి రాంబాబు పాల్గొన్నారు. వెలుగు కార్యాలయంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. వెలుగు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

నాతవరం: ప్రతి వ్యక్తి యోగాసనాలు చేయడం వల్ల ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎంఈవో –2 కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. శుక్రవారం స్థానిక హైస్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ యోగా చేయడం వల్ల ఒత్తిడిని జయించవచ్చని, కోపం వంటివి అదుపులో ఉంటాయన్నారు. క్షణికావేశంలో అనేక చెడు పనులు చేస్తామని, వాటిని నియంత్రించవచ్చన్నారు. ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

మాకవరపాలెం: స్థానిక ప్రాథమిక పాఠశాలలో లలిత కళా శిక్షణా కేంద్రం, ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పెద్దలు ఆసనాలు వేశారు. నిత్యం యోగా చేయడం ద్వారా కలిగే ఉపయోగాలను యోగా గురువు చినబాబు వివరించారు. ఉపాధి కూలీలతో కలసి మాకవరపాలెం సర్పంచ్ అల్లంపల్లి శిరీష్ యోగాసనాలు వేశారు. లలిత కళా శిక్షణ కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు, శేషగిరిరావు, ఉపాధ్యాయులు కె.రాము, రమణ, బీజేపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కె.కోటపాడు: యోగాసనాల వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులు గుర్తించాలని ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం దాలివలస ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. విద్యార్థి దశ నుంచే యోగాను అలవర్చుకోవడం వల్ల ఆరోగ్యంతోపాటు మానసిక స్థైర్యం కలుగుతుందని ఆయన తెలిపారు. కె.కోటపాడు అయ్యన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ ఆధ్వర్యంలో యోగా విద్యకు సంబంధించిన నమూనా రూపంలో విద్యార్థులు నిల్చొని విన్యాసం చేశారు. లంకవానిపాలెం పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో కలిసి వైద్యాధికారి శైలజ యోగాసనాలు వేశారు. రోజూ యోగా చేయడాన్ని అలవర్చుకోవాలని ఆమె తెలిపారు.

కె.జె.పురంలో ఉపాధి కూలీలతో

మాడుగుల రూరల్: కె.జె.పురంలో ఫారమ్ పాండు ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులతో యోగాసనాలు చేయించారు. ఫీల్డ్ అసిస్టెంట్ భీశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యోగా ఆవశ్యకత గురించి వివరించారు. సర్పంచ్ జామి రమణబాబు, ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు, వార్డు సభ్యుడు ఆడారి వెంకట సూరిప్పారావు, మేట్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల యోగాసనాలు

దేవరాపల్లి: మండల వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవ ఉత్సాహంగా నిర్వహించారు. రైవాడ పంచాయతీ బేతపూడి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ప్రత్యేకాధికారి భువన మాధురి ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. విద్యార్థినులతోపాటు ఉపాధ్యాయినులు యోగాసనాలు చేసి అబ్బుర పరిచారు. 'యోగా డే'ను అక్షర రూపంలో విద్యార్థినులు ప్రదర్శించి విశేషంగా ఆకట్టుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్ భువన మాధురి మాట్లాడుతూ శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు యోగా దోహదపడుతుందని వివరించారు. తెనుగుపూడి డాక్టరు బీఆర్. అంబేడ్కర్ బాలుర గురుకుల విద్యాయంలో ప్రిన్సిపాల్ సిహెచ్. రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో పీడీ తరుణ్ యోగా డే వేడుకలను నిర్వహించారు. కష్టతరమైన యోగాసనాలను సైతం విద్యార్థులు అవలీలగా వేసి అబ్బురపరిచారు.

గొలుగొండ: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా గొలుగొండ పోలీసులు, చోద్యం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు యోగాసనాలు వేశారు. యోగా వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. రోజు యోగా చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు నుంచి విముక్తి పొందవచ్చన్నారు. ఉపాధ్యాయలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పిరమిడ్ విన్యాసాలు

బుచ్చెయ్యపేట: వడ్డాది మేజర్ పంచాయతీలోని కేజీబీవీలో విద్యార్థినుల యోగా విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇక్కడ యోగా పోటీలు నిర్వహించారు. పలు ఆకృతిలో ప్రదర్శించిన ఆసనాలతోపాటు పిరమిడ్ ఆకారాల్లో విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ప్రతి ఒక్కరూ రోజూ ఆసనాలు, వ్యాయామం చేయడం వల్ల మానసిక ఉల్లాసం, ఉత్సాహంతోపాటు శారీరక దృఢత్వంతో సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంటారని ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తెలిపారు. మనం ఆసనాలు చేయడమే కాక కుటుంబ సభ్యులతో చేయించడం వల్ల అందరూ ఆరోగ్యంగా ఉంటామని సూచించారు.

రోలుగుంట: యోగా డే సందర్భంగా రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్ ఆర్‌వీఎస్ఆర్ శర్మ విద్యార్థులలో కలసి సూర్య, చంద్ర నమస్కారాలు, తదితర ఆసనాలు వేశారు. యోగా డే ఆకారంలో కూర్చొని విద్యార్థులు ఆకట్టుకున్నారు. బుచ్చింపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా డే ప్రాముఖ్యతను హెచ్ఎం శేఖర్ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమాలు కొమరవోలు, బీబీపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోనూ నిర్వహించారు.

చోడవరం రూరల్: ప్రధానోపాధ్యాయుడు జి.జె. సుందర్‌సింగ్ ఆధ్వర్యంలో గవరవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సామూహిక యోగాభ్యాసన చేయించారు. యోగాభ్యాసన ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ఫిజికల్ డైరెక్టర్ మోహన్ విద్యార్థులకు యోగా సంకల్పం చెప్పించి, పలు రకాల యోగాసనాలను వేయించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ సిహెచ్.ఎ.నాయుడు, కార్యదర్శి వైకుంతరావు, ఉపాధ్యాయులు శంకర్, దొర, విశ్వనాథ్, ఎ.ఎస్. కృప పాల్గొన్నారు.


చోడవరం: పతంజలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న యోగా అభ్యసకులు


చోడవరం వాకర్స్ క్లబ్ ఆవరణంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



దేవరాపల్లి: బేతపూడి కేజీబీవీలో ఆకట్టుకున్న విద్యార్థినులు యోగా డే అక్షర రూపం


దేవరాపల్లి: యోగాసనాలు చేస్తున్న కేజీబీవీ విద్యార్థినులు, ఉపాధ్యాయినులు


కె.కోటపాడు: యోగా లోగో రూపంలో అయ్యన్న కళాశాల విద్యార్థులు


కె.కోటపాడు: లంకవానిపాలెంలో వైద్య సిబ్బంది, వైద్యాధికారి శైలజ యోగాసనాలు


మాడుగుల రూరల్: కె.జె.పురంలో యోగా చేస్తున్న ఉపాధి కూలీలు


నర్సీపట్నం: యోగాసనాలపై విద్యార్థినులకు తర్ఫీదు ఇస్తున్న సీడీపీవో మేరీ సువార్త


నర్సీపట్నం: పెదబొడ్డేపల్లి హైస్కూల్‌లో ఆసనాలు వేస్తున్న ఎంఈవో తలుపులు, ఉపాధ్యాయులు


బుచ్చెయ్యపేట: వడ్డాది కేజీబీవీలో విద్యార్థినుల పిరమిడ్ విన్యాసాలు


రోలుగుంట: విద్యార్థులతో కలసి ఆసనాలు వేస్తున్న శర్మ మాస్టారు


చోడవరం రూరల్: యోగాభ్యాసనలో విద్యార్థులు


మాకవరపాలెంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


నాతవరం: యోగాసనాలు చేస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు, విద్యార్థులు


నాతవరం: హైస్కూల్‌లో విద్యార్థుల యోగాసనాలు


కె.కోటపాడు: విద్యార్థులతో యోగాసనాలు వేసిన ఎంఈవో సత్యనారాయణ


రోలుగుంట: బుచ్చింపేట హైస్కూల్లో విద్యార్థుల ఆసనాలు

దేవదాయ భూముల కౌలు వేలం వాయిదా


చిననందిపల్లిలో వేలం పాట నిర్వహిస్తున్న దేవదాయ శాఖ అధికారులు


దేవదాయ భూముల కౌలు వేలం నిర్వహిస్తున్న అధికారులు, పాల్గొన్న పాటదారులు

దేవరాపల్లి: చిననందిపల్లిలో ఉమా నీలకంఠేశ్వర స్వామి దేవస్థాన భూముల కౌలు వేలం మరోమారు వాయిదా పడింది. ఈ నెల 3న దేవదాయ శాఖ అధికారులు వేలం నిర్వహించారు. వారు నిర్ణయించిన వేలం ప్రారంభ ధర అధికంగా ఉండటంతో పాట పాడేందుకు రైతులు ముందుకు రాలేదు. దీంతో వేలం పాటను వాయిదా వేశారు. తాజాగా శుక్రవారం అనకాపల్లి దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీధర్, వడ్డాది దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టీవీఎస్ఎస్ శర్మల ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. చిననందిపల్లి సర్వే నంబర్ 50లో 3.37 ఎకరాలు, సర్వే నంబర్ 112లో 5.03 ఎకరాల భూములకు మూడేళ్ల కౌలుకు గాను ఈ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఒక్కరు మాత్రమే రూ. 3 వేలు చొప్పున దరావత్తు చెల్లించడంతో వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. తొలిసారి నిర్వహించిన వేలంలో సర్వే నంబర్ 50లో 3.37 ఎకరాలకు ప్రారంభ పాటగా ఎండోమెంట్ అధికారులు రూ.45 వేలు, సర్వే నంబర్ 112లో 5.03 ఎకరాలకు రూ. 55 వేలుగా నిర్ణయించి వేలం పాట ప్రారంభించారు. ప్రస్తుతం వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదని, గ్రామంలో ఎకరాకు రూ.5 వేల కౌలు ఇస్తున్నామని స్థానిక రైతులు చెబుతున్నారు. ధర తగ్గిస్తే తప్ప ఇంత మొత్తంలో పాల్గొన లేమని గ్రామస్తులు చెప్పగా, ఇదే విషయాన్ని లిఖిత పూర్వకంగా ఇస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి కార్యాచరణ చేపడతామని అధికారులు స్పష్టం చేశారు. పోతల రఘు వెంకట ప్రసాద్, మతల ఆరినాయుడు తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోలుగుంటలోనూ..

రోలుగుంట: దేవదాయ శాఖ ఆధీనంలో నాలుగు రెవెన్యూల భూముల కౌలు వేలం గతేడాది కన్నా తక్కువకు పాడినందున వాయిదా పడింది. శుక్రవారం స్థానిక పాత రామ మందిరం వద్ద కల్యాణ మండపంలో సీతారామస్వామి, వేంకటేశ్వర స్వామి వారికి చెందిన నాలుగు రెవెన్యూల్లో 11 ఎకరాలకు కొత్తకోట గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి కె.బి.ఆశా కిరణ్మయి కౌలు వేలం పాట నిర్వహించారు. ఎనిమిది మంది నుంచి ఆధార్‌తోపాటు ధరావత్తుగా రూ.5 వేలు వంతున తీసుకొని ఆ శాఖ ఉద్యోగి భాస్కరచారి పాట ప్రారంభించారు. మూడేళ్ల క్రితం పాటలో సర్వే నంబర్ 117/2,3లో 3:70 సెంట్ల విస్తీర్ణం గల పల్లపు భూమిని రూ.40 వేలకు దక్కించుకోగా, తాజా వేలంలో రూ.15 వేలకు మాత్రమే పాడారు. కొండపాలెం రెవెన్యూ సర్వే నంబర్ 14లో 1:90 సెంట్ల పల్లపు భూమిని గతంలో రూ.15 వేలకు పాడగా, తాజా పాటలో రూ.9,200కు పాడారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధి పెద బొడ్డేపల్లి రెవెన్యూ సర్వే నంబరు 14లో 1.90 సెంట్ల విస్తీర్ణం పల్లపు భూమిని ఎవరూ పాట పాడేందుకు రాలేదు. కొవ్వూరు పంచాయతీ వెదుళ్లవలస రెవెన్యూ భూముల్లో ఆరు సంవత్సరాలకుగాను సరుగుడు మొక్కలు పెంచుతామని పాటదారులు చెప్పారు. దీనికి నిబంధనలు భిన్నంగా ఉండడంతోపాటు మిగిలిన పాట తక్కువగా పాడినందున వేలం వాయిదా వేసినట్టు కార్యనిర్వహణాకారి తెలిపారు. గ్రామ పెద్దలు మడ్డు కన్నం నాయుడు, సుర్ల నర్సింహమూర్తి, రుత్తల శ్రీను పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ ప్రారంభం


లచ్చన్నపాలెంలో విత్తనాలు అందిస్తున్న నేతలు


రైతులకు విత్తనాలను అందిస్తున్న అప్పలనాయుడు, యడ్ల రమేష్

మాకవరపాలెం: లచ్చన్నపాలెంలో సబ్సిడీ వరి విత్తనాల పంపిణీని శుక్రవారం ప్రారంభించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రుత్తల శేషుకుమార్, శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు వీటిని రైతులకు అందించారు. మండలంలోని 15 ఆర్బీకేల్లో 82 టన్నుల విత్తనాలను పంపిణీకి సిద్ధం చేసినట్టు ఏవో చిరంజీవి తెలిపారు. లచ్చన్నపాలెం సర్పంచ్ పోతల రామలక్ష్మి, టీడీపీ నేతలు జోగిపాత్రుడు, చిరంజీవి పాల్గొన్నారు.

కె.కోటపాడు: రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు అందిస్తున్నట్లు ఆర్బీకే వ్యవసాయ శాఖ సహాయకుడు ఎ.అప్పలనాయుడు తెలిపారు. కొరువాడ జగన్నాథపురం ఆర్బీకేలో విత్తనాలను పంపిణీ చేశారు. సోనామసూరి, సాంబమసూరి, శ్రీదృతి, మార్టేరుసాంబ, 1318 రకం విత్తనాలందించారు. యడ్ల రమేష్, ఉప సర్పంచ్ గొర్లె అప్పారావు, గూనూరు గోవింద, రెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక కుంకుమ పూజలు

మాడుగుల రూరల్: జంపెనలో వాసవీమాతకు శుక్రవారం భక్తులు ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పుట్టా మోహన్‌రావు సారథ్యంలో కింతలి గాదిరాయి వాసవీ క్లబ్ సభ్యులు, మహిళలు పూజల్లో పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయంలో..

కె.జె.పురం సంతోషిమాత ఆలయంలో అమ్మవారికి భక్తులు కుంకుమ పూజలు, గోమాతకు పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు ఏర్పాట్లు చేశారు.


ప్రత్యేక అలంకరణలో జంపెన వాసవీమాత


వాసవీమాతకు పూజలు చేస్తున్న దృశ్యం